అభివృద్ధిపై చర్చకు సిద్ధం

• నగర ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్‌కుమార్



14వ డివిజన్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరు నగరంలో జరిగిన అభివృద్ధిపై తాను చర్చకు సిద్ధంగా ఉన్నానని నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ తెలిపారు. నగరంలోని 14వ డివిజన్ పద్మావతినగర్, అద్దాల సాయిబాబాగుడి వీధి, వేపదొరువు తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే శుక్రవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అందని వారికి అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరంలో అభివృద్ధి తానే చేశానని ఒకాయన చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గత ప్రభుత్వంలో 43 వేల ఇళ్ల నిర్మాణాలు మొదలుపెట్టారని, అయితే ప్రస్తుతం ఒక చదరపు అడుగుకు దాదాపు రూ.500 తగ్గించి తాము ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో ప్రజల నుంచి ఒక చదరపు అడుగుకు రూ.2,500 చొప్పున వసూలు చేయగా, దాదాపు ఒక ఇంటిపై రూ.2 లక్షల కమిషన్ తీసుకున్నారని, అలా 43 వేల ఇళ్లకు రూ.800 కోట్లు దోపిడీ చేసిన చరిత్ర వారిది అని దుయ్యబట్టారు. అందులో 37 వేల కుటుంబాలకు నెలనెలా రూ.2 వేల చొప్పున రూ.3 లక్షలు పూర్తిగా మాఫీ చేసి కేవలం రూ.500లకే ఇల్లు ఇచ్చిన ప్రభుత్వం తమది అని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో నాలుగున్నరేళ్లపాటు గుంతలు తవ్వి ప్రజలను ఇబ్బందులకు గురి చేశారని, ఎన్నికలకు ఆరు నెలల ముందు ఇష్టానుసారంగా రోడ్లు వేసి అభివృద్ధి చేశామనడం విడ్డూరంగా ఉందని అన్నారు. మొదలుపెట్టి పనుల్లో ఏ ఒక్కటైనా పూర్తిచేశారా అని ప్రశ్నించారు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తాము చేసిన అభివృద్ధిని గర్వంగా చెప్పుకోగలుగుతామన్నారు. పెన్నా బ్యారేజీని పూర్తి చేశామని, ఫ్లైఓవర్ వంతెన మొదలుపెట్టి పూర్తి చేశామని, అలాగే వేల ఇళ్లను కాపాడుతూ సర్వేపల్లి కాలువ, జాఫర్ సాహెబ్ కాలువ, మైపాడు రోడ్డును తీసుకొస్తోంది తామేనన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నార్త్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బాధ్యతల స్వీకరణ



నూతన ఇన్‌స్పెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్సై గీతారమ్య

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు నార్త్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా పి.శివాజి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎస్సైలు శివశంకర్, కె.గీతారమ్య, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి, ఏఎస్పీ డి.హిమవతిలను మర్యాదపూర్వకంగా కలిశారు. శివాజి 2004 బ్యాచ్ అధికారి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల పర్యవేక్షణలో నగరవాసులకు ట్రాఫిక్ సమస్యలు లేకుండా కృషి చేస్తామని తెలిపారు.

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు

నెల్లూరు రూరల్: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని నెల్లూరు సెబ్–2 సీఐ వెంకటేశ్వరరావు సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై రూరల్ పరిధిలోని బుజబుజనెల్లూరు సమీపంలో ఉన్న రావూస్ ఫార్మసీ కళాశాలలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాలను వినియోగిస్తే జీవితం నాశనమవుతుందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. మాదకద్రవ్యాలపై తమకు సమాచారం అందించినట్లయితే తగిన చర్యలు తీసుకుంటామని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. అనంతరం మాదకద్రవ్యాల వ్యతిరేక పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సెబ్ సబ్ ఇన్‌స్పెక్టర్ శకుంతలాదేవి, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పౌష్టికాహారం పంపిణీ



నెల్లూరు రూరల్: రూరల్ పరిధిలోని కొండాయపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లను శుక్రవారం వైఎస్సార్‌సీపీ 20వ డివిజన్ నాయకులు రావు శ్రీనివాసరావు, తాళ్లూరి సురేష్ ఆధ్వర్యంలో గర్భిణులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెల్లూరు ఎంపీ, రూరల్ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి సూచనలతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గోపాల్‌రెడ్డి, నారసింహరెడ్డి, నాగేశ్వరరెడ్డి, సరళమ్మ, రమాదేవి, లక్ష్మీపద్మజ, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని పలు విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతులు, విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్న దృష్ట్యా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆ శాఖ నెల్లూరు టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సోమశేఖర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కెట్టిగుంటరోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మూడోమైలు, మంగళదిబ్బ, కిసాన్‌నగర్, జాకీర్‌హుస్సేన్ నగర్, శ్రీనివాసనగర్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని తెలిపారు. అలాగే కొండాయపాళెం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో కొండాయపాళెం, బ్యాంకుకాలనీ, షార్‌కాలనీ, అనుగుంట, ఆర్టీఓ కార్యాలయం పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని తెలిపారు. అదేవిధంగా బీవీనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో వనంతోపుసెంటర్, పెద్దబావిసెంటర్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని తెలిపారు.

పదోన్నతి జాబితాలో అడ్మిన్ ఏఎస్పీ హిమవతి

నెల్లూరు(క్రైమ్): రాష్ట్ర ప్రభుత్వం ఏఎస్పీలకు నాన్ క్యాడర్ ఎస్పీలుగా పదోన్నతి కల్పించేందుకు ప్యానల్ జాబితాను శుక్రవారం విడుదల చేసింది. అందులో నెల్లూరు జిల్లా అడ్మిన్ ఏఎస్పీ డి హిమవతి ఉన్నారు. హిమవతి గతేడాది మేలో ఏఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. కొద్దినెలలుగా సెబ్ అధికారిణిగా సైతం బాధ్యతలు నిర్వహిస్తున్నారు. త్వరలో ఆమెకు పదోన్నతి లభించనుంది.

ఎన్‌ఎస్‌యూఐ ర్యాలీ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేయాలని, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చేపట్టాలని, రాష్ట్రానికి ప్రత్యేక హోదాపై కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరుతూ నగరంలోని గాంధీబొమ్మసెంటర్ వద్ద శుక్రవారం ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీ ఆత్మకూరు బస్టాండ్ నుంచి గాంధీబొమ్మ సెంటర్ వరకు కొనసాగింది.

ఆర్టీసీ ఈయూ సమావేశం

నెల్లూరు సిటీ: నగరంలోని ఏపీపీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ నెల్లూరు జిల్లా విస్తృత స్థాయి కౌన్సిల్ సమావేశం స్థానిక సీపీఐ కార్యాలయంలో జిల్లా యూనియన్ అధ్యక్షుడు వి.ప్రసాద్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. సమావేశంలో ఈయూ రాష్ట్ర డిప్యూటీ జెనరల్ సెక్రటరీ నారాయణరావు, నాయకులు పలిశెట్టి దామోదర్‌రావు, జీవీ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

డీఆర్వోకు వినతి

నెల్లూరు(దర్గామిట్ట): ఇటీవల బదిలీలు, పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు జీతాలు వెంటనే అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్టీయూఏపీ నాయకులు శుక్రవారం డీఆర్వో వెంకట నారాయణమ్మకు ఆమె కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

వేతనాలు ఇవ్వాలి

నెల్లూరు(టౌన్): బదిలీ, పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు వెంటనే వేతనాలు ఇవ్వాలని అపస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి రాజగోపాల్, చంద్రమౌళి కోరారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏడీ గ్లోరీకుమారికి వినతిపత్రం అందజేశారు.

డీసీఎల్‌కు వినతిపత్రం అందజేత

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నగరంలోని పొగతోటలో ఉన్న ఏపీ కార్మికశాఖ కార్యాలయంలో జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్(డీసీఎల్) వెంకటేశ్వర్లును ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ నాయకులు శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు.

జీతాలు చెల్లించాలి

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న పంచాయతీ కార్మికులకు, గ్రీన్ అంబాసిడర్స్, స్వచ్ఛభారత్ కార్మికులకు బకాయిలు ఉన్న జీతాలు చెల్లించాలంటూ శుక్రవారం ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు.

పెండింగ్ పనులన్నీ పూర్తి చేస్తాం

• నగర ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్‌కుమార్



సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగర నియోజకవర్గంలో పెండింగ్ పనులనేవి లేకుండా అన్ని పనులు పూర్తి చేస్తామని నగర ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్‌కుమార్ అన్నారు. నెల్లూరు నగరంలోని 45వ డివిజన్ పొగతోటలో రూ.28 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్ల పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్2 సినిమా హాల్ నుంచి బృందావనం వరకు ఎక్కడెక్కడ రోడ్లు మరమ్మతులకు గురయ్యాయో, డ్రెయిన్లకు సంబంధించి రూ.2.50 కోట్లతో అంచనాలు సిద్ధం చేసి ఈ నెలాఖరు లోపు శంకుస్థాపన చేసి అన్ని పనులు త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. అక్టోబర్ నెలకు పొగతోట, బృందావనం ప్రాంతాల్లో అన్ని పనులు పూర్తి చేస్తామన్నారు. నగర నియోజకవర్గంలో ఎక్కడెక్కడ ప్రధాన రహదారులు మరమ్మతులకు గురయ్యాయో ఆ పనులకు కూడా టెండర్లు పిలుస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్లు ముదిరెడ్డి వేదవతి, వేలూరు మహేష్, నీలి రాఘవరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బైక్ అపహరణ

నెల్లూరు(క్రైమ్): బైక్ అపహరణ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు..ఉమ్మారెడ్డిగుంట, పెద్దబావిసెంటర్‌కు చెందిన మురళి గత నెల 20న రాత్రి రోజులాగే తన డియో డ్రమ్ బైక్‌ను తన ఇంటి ముందు నిలిపి నిద్రపోయాడు. మరుసటి రోజు ఉదయం లేచి చూడగా బైక్ కనిపించలేదు. ఈ మేరకు బాధితుడు వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వేధింపులపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): అదనపుకట్నం కోసం భార్యను వేధింపులకు గురిచేసిన ఘటనలో భర్త, అత్తింటివారిపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు..బీవీనగర్‌కు చెందిన సునీత అలియాస్ పావనికి తిరుపతి జిల్లా కోట మండలం మద్దాలికి చెందిన హరికృష్ణతో 2019లో వివాహమైంది. వివాహ సమయంలో రూ.3 లక్షల నగదు, పన్నెండున్నర సవర్ల బంగారు ఆభరణాలను సునీత కుటుంబసభ్యులు అల్లుడికి కట్నకానుకల కింద ఇచ్చారు. వివాహానంతరం సునీత, హరికృష్ణ మద్దాలిలో కాపురం పెట్టారు. కొద్దిరోజులు వారి కాపురం సజావుగా సాగింది. మద్యానికి బానిసైన భర్త ఆమెను శారీరకంగా, మానసికంగా వేధించేవాడు. అత్తమామలు అతనికి వత్తాసు పలకడంతో సునీత పరిస్థితి దయనీయంగా మారింది. అదనపుకట్నం కోసం భర్త, అత్తింటివారు ఆమెను చిత్రహింసలకు గురిచేయసాగారు. వారి వేధింపులు తాళలేక బాధితురాలు వేదాయపాళెం పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

8న శాంతియుత నిరసన ర్యాలీ

నెల్లూరు(బృందావనం): మణిపూర్ ఘటనలకు సంబంధించి నెల్లూరు జిల్లా క్రైస్తవ సమైఖ్య వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీన నగరంలో 'శాంతియుత నిరసన ర్యాలీ'' చేపట్టనున్నట్లు రోమన్ కేథలిక్ మిషన్ బిషప్ మోస్ట్ రెవరెండ్ ఎం.డి.ప్రకాశం తెలిపారు. సంతపేటలోని ఆర్సీఎం చర్చి ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ర్యాలీ సుబేదారుపేటలోని ఏబీఎం కాంపౌండ్ నుంచి ఉదయం 9 గంటలకు ప్రారంభమై కనకమహల్ సెంటర్, గాంధీబొమ్మ, వీఆర్సీ, బారకాసుసెంటర్ మీదుగా కలెక్టర్ కార్యాలయం వరకు చేరుతుందన్నారు. సమావేశంలో క్రైస్తవ సమైఖ్య వేదిక నాయకులు రెవరెండ్ బి.డేవిడ్ దయాసాగర్, పాస్టర్స్, రెవరెండ్స్ వి.సురేంద్రబాబు, రాజశేఖర్‌దాసరి, కె.ఎలీషాకుమార్, ఆర్.హృదయకుమార్, స్వర్ణ వెంకయ్య, లూథర్ శ్యామ్యూల్, ఫాదర్ విలియమ్స్, ఫాదర్ ఇన్నయ్య, రాఘవ మోసెస్, హరిపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిద్దాం

• జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ మాలకొండయ్య



మాట్లాడుతున్న జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ మాలకొండయ్య

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిద్దామని జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ మాలకొండయ్య పేర్కొన్నారు. నెల్లూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ పరిశోధనా స్థానంలో ప్రకృతి వ్యవసాయంపై శుక్రవారం మండల స్థాయి అధికారులు, సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పంటలు సాగు చేస్తే అయ్యే ఖర్చులు, వచ్చే లాభాలను రైతులకు గ్రామస్థాయిలో వివరించాలని సూచించారు. ప్రధానంగా ప్రకృతి వ్యవసాయానికి ఉపయోగించే జీవామృతాలు తదితర వాటిని రైతులకు అందుబాటులో ఉండేలా అన్ని చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి అందే ప్రోత్సాహకాలను కూడా వివరించాలని సూచించారు. కార్యక్రమంలో వెంకట్రావు, రవిచంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను ఆదుకుంటాం



రెహానాకు అడిషనల్ కార్పస్ ఫండ్ చెక్కును అందజేస్తున్న ఏఎస్పీ హిమవతి

నెల్లూరు(క్రైమ్): విధి నిర్వహణలో మృతిచెందిన పోలీసు కుటుంబాలను అన్నివిధాలా ఆదుకుంటామని ఏఎస్పీ డి.హిమవతి పేర్కొన్నారు. అనంతసాగరం పోలీస్‌స్టేషన్‌లో పి.కరిముల్లా హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ మృతిచెందగా ఆయన భార్య రెహానాకు శుక్రవారం ఆమె తన చాంబర్‌లో అడిషనల్ కార్పస్ ఫండ్ చెక్కును అందజేశారు. వెంకటాచల సత్రం పోలీస్‌స్టేషన్‌లో పి.రాము కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ మృతిచెందగా ఆయన భార్య సుధారాణికి రూ.లక్ష అడిషనల్ కార్పస్ ఫండ్, రూ.50 వేల విడో ఫండ్ చెక్కులను అందజేశారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని సదుపాయాలు త్వరితగతిన వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శిరీష, హెచ్1 జూనియర్ అసిస్టెంట్ ఎస్‌వీ అంజనీకుమార్, మృతుల కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు వినియోగం ఆరోగ్యానికి హానికరం



పెద్దాస్పత్రి ఎదురుగా ఉన్న దుకాణంలో తనిఖీ చేస్తున్న దృశ్యం

నెల్లూరు(బారకాసు): పొగాకు ఉత్పత్తుల వినియోగం ఆరోగ్యానికి హానికరమని జేవీఆర్ కాలనీ యూహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ కుసుమ పేర్కొన్నారు. జిల్లావైద్యారోగ్యశాఖాధికారి ఆదేశాల మేరకు శుక్రవారం నగరంలోని దర్గామిట్ట పరిసర ప్రాంతాల్లో ఎన్‌సీడీ ప్రాజెక్ట్ అధికారి ఆధ్వర్యంలో ఎన్‌సీడీ సిబ్బంది, యూపీహెచ్‌సీ సిబ్బంది ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కుసుమ మాట్లాడుతూ పొగాకు వినియోగం వలన అనేక ఆరోగ్య సమస్యలు సంభవిస్తాయన్నారు. పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని, బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేయడం నిషేధమని, 18 ఏళ్ల వయస్సు లోపు వారికి పొగాకు ఉత్పత్తులు విక్రయించరాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీపీ సోషల్ వర్కర్ ఎం.హాసిన్, సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, ఏఎస్సై బ్రహ్మయ్య, కానిస్టేబుల్ చిన్నయ్య, ఏఎన్‌ఎం పద్మ, ఆశా కార్యకర్త పార్వతి పాల్గొన్నారు.

6న కళాకారులకు పురస్కారాలు



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న కేతా సుబ్బారావు, ఎ.రాయప్ప తదితరులు

నెల్లూరు(బృందావనం): జిల్లాలో కళారంగాభివృద్ధికి తమవంతు కృషి చేస్తున్న వివిధ రంగాలకు చెందిన 'కళాకారులకు అవార్డులు' ఇవ్వనున్నట్లు కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు కేతా సుబ్బారావు తెలిపారు. నగరంలోని పురమందిరం ప్రాంగణంలో శుక్రవారం కార్యక్రమ నిర్వహణకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఈ నెల 6వ తేదీన పురమందిరంలో తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమంలో పలువురు కళాకారులు పురస్కారాలను అందుకోనున్నారని తెలిపారు. ఈ సందర్భంగా జరిగే సంగీత, నృత్య పోటీల్లో పాల్గొనే చిన్నారులకు ప్రోత్సాహకంగా నగదు బహుమతులతోపాటు అవార్డులు అందజేసి సత్కరించనున్నామన్నారు. ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో 50 మంది చిన్నారులతో నృత్య ప్రదర్శనలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు, శ్రీబాలాజీ ఆర్కెస్ట్రాచే సంగీత విభావరి ఉంటుందని తెలిపారు. సమావేశంలో ఎ.రాయప, ఎన్వీ రమణయ్య, ఎం.మల్లికార్జున పాల్గొన్నారు.

తల్లిపాలతో సంపూర్ణ ఆరోగ్యం



బాలింతకు రొట్టెలు, హార్లిక్స్, బిస్కెట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

నెల్లూరు(బారకాసు): తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ కోఆర్డినేటర్ లక్ష్మీసునంద తెలిపారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా లయన్స్‌క్లబ్ సేవాప్రియ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని జీజీహెచ్ ప్రసూతి వార్డులో బాలింతలకు రొట్టెలు, హార్లిక్స్, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు వెంటనే తల్లిపాలు పడితే వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందన్నారు. మొదటి ఆరు నెలలు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలన్నారు. ఆరు నెలలు ఆపైన అనువైన కుటుంబ ఆహారం తోపాటు తల్లిపాలు 2 సంవత్సరాల వయస్సు వరకు లేదా ఆపైన వీలైనంత ఎక్కువ కాలం ఇప్పించడం సరైన పోషణ విధానం అని వివరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సేవాప్రియ అధ్యక్షురాలు శైలజ, సెక్రటరీ సునంద, ట్రెజరర్ అనూరాధ, పద్మ, శుభశ్రీ, యశోధర తదితరులు పాల్గొన్నారు.

త్వరలో జనరిక్ మెడికల్ షాపు ప్రారంభం



మాట్లాడుతున్న డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని స్టోన్‌హౌస్‌పేటలో ఉన్న జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ(డీసీఎమ్మెస్) కార్యాలయంలో జనరిక్ మెడిసిన్ షాపును త్వరలో ప్రారంభిస్తామని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు తెలిపారు. డీసీఎమ్మెస్ కార్యాలయంలో శుక్రవారం పాలకమండలి సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డీసీఎమ్మెస్‌ను జిల్లాలో మరింత అభివృద్ధి పథంలో తీసుకెళ్లేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

రాష్ట్ర కమిషనర్ ఆదేశాల మేరకు డీసీఎమ్మెస్ ఆధ్వర్యంలో జనరిక్ మెడికల్ షాపును డీసీఎమ్మెస్ కార్యాలయం మొదటి అంతస్తులో త్వరలో ఏర్పాటు చేసేందుకు పాలకమండలి తీర్మానం చేసినట్లు తెలిపారు. నవాబుపేటలో ఉన్న డీసీఎమ్మెస్‌కు చెందిన పాత రైస్‌మిల్లు పాత యంత్రాలను ఇప్పటికే వేలం వేశామని, పాత రైస్‌మిల్లు స్థానంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సహకారంతో గోదాములు, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలను చేపడతామని తెలిపారు. అలాగే డీసీఎమ్మెస్ కార్యాలయ భవనాన్ని కూడా నిర్మించేందుకు పాలకమండలిలో తీర్మానం చేసినట్లు తెలిపారు. సమావేశంలో డీసీఎమ్మెస్ డైరెక్టర్లు రంగనాథం, ఖిల్జీ సలీం, సురేష్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, బిజినెస్ మేనేజర్ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో వ్యాక్సిన్లు వేయించాలి



డిక్లరేషన్ పత్రాలను అందజేస్తున్న డీడీ నాగమణి

ఇందుకూరుపేట: మూగజీవాలకు సకాలంలో వ్యాక్సిన్లు వేయించాలని పశుసంవర్ధక శాఖ డీడీ డాక్టర్ ఎం.నాగమణి అన్నారు. మండలంలోని ప్రాంతీయ వైద్యశాలలో శుక్రవారం ఇందుకూరుపేట, తోటపల్లిగూడూరు మండలాల పరిధిలోని ఆ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగమణి ఎస్‌ఎల్‌ఎం ప్రాజెక్ట్ కింద చేపట్టిన వివిధ రకాల స్కీమ్స్‌పై అధికారులతో సమీక్షించారు. ప్రభుత్వ నిర్దేశించిన లక్ష్యాలను నూరుశాతం అధిగమించాలన్నారు. ఏహెచ్ సహాయకులకు డిక్లరేషన్ సర్టిఫికెట్లను డీడీ అందజేశారు. కార్యక్రమంలో ఏడీలు మురళీకృష్ణ, బి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన విద్యార్థులకు రుణాలివ్వాలి

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలో అర్హులైన విద్యార్థులకు రుణాలు ఇవ్వాలని లా విద్యార్థి కిరణ్, లాయర్ గంగిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు లా విద్యార్థులతో కలిసి నెల్లూరులోని గాంధీబొమ్మ సెంటర్‌లో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిటీ యూనియన్ బ్యాంక్ అధికారులు ప్రాంతీయ వివక్ష చూపిస్తూ కొందరికే రుణాలు ఇస్తున్నారని, అర్హులైన విద్యార్థులకు రుణాలు ఇవ్వాలని కోరారు.

అభ్యంతరాలు తెలపండి

నెల్లూరు(బృందావనం): నగరంలోని శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో రూ.300లతో వి.ఐ.పి. దర్శనం టిక్కెట్‌ను ప్రవేశపెట్టనున్నామని, అందుకు సంబంధించి ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా ఈ నెల 24వ తేదీ లోపు తెలియజేయాలని ఆ దేవస్థానం ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవస్థానం ధర్మకర్తల మండలి తీర్మానం మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రూ.300 టిక్కెట్టు తీసుకున్న భక్తులకు రెండు లడ్డూలను (80 గ్రాములు) అమ్మవారి ప్రసాదంగా ఇవ్వనున్నట్లు తెలిపారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని రేబాల సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. నెల్లూరులోని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో 200 మంది పాల్గొన్నారు. వారందరికీ ఉచితంగా వైద్య పరీక్షలను నిర్వహించడంతోపాటు మందులు అందజేశారు. సుమారు 60 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో దాతలు హరిప్రసాద్‌రెడ్డి, అశోక్‌కుమార్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, ఎంపీపీ శ్రీనివాసులు, సర్పంచ్ భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ రమణమ్మ, స్థానికులు శివరామకృష్ణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, మస్తానయ్య పాల్గొన్నారు.